క్లుప్తంగా

సస్యరక్షణతో అధిక దిగుబడి



సాగులో ఉన్న మినప

నింద్ర : సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి తులసీరామ్ తెలిపారు. మంగళవారం నింద్ర, మిట్టూరులో రైతులు సాగు చేస్తున్న మినప, పెసర పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంటలకు సోకే తెగుళ్లను వెంటనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. చీడపీడలను అరికట్టేందుకు ఎకరాకు క్లోరిఫైపాస్ 500 మిల్లీలీటర్లకు మెంగోజెబ్ 200 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండల వ్యవసాయ కార్యాలయంలో రాయితీపై వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. మంగళవారం టీసీ అగ్రహారం, పాదిరేడు, తట్నేరి గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షానికి పంట నష్టపోయిన రైతులకు విత్తనాలను ఏఓ విజయకుమార్ అందించారు. మొదటి దశలో 20 మందికి మొత్తం 6 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో చెరువు ఆయకట్టు సంఘం ప్రెసిడెంట్ తోట మురళి, మునికృష్ణ, విద్యాసాగర్, అయ్యప్ప, ఏఈఓ సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

పగటిపూట విద్యుత్‌కు రైతుల వినతి

పుత్తూరు: వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరారు. మంగళవారం పరమేశ్వరమంగళం సబ్‌స్టేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాత్రి వేళల్లో మోటర్ వేసేందుకు వెళ్లే క్రమంలో పాము కాటుకు గురై పలువురు మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పగటి పూట విద్యుత్ ఇస్తే సౌకర్యంగా ఉంటుందని వెల్లడించారు. టెక్నికల్ ఈఈ వాసవీలత స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.రైతులు సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ దేవాశీర్వాదం, ఏడీఈ శంకరయ్య, ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

ఓంశక్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పాలసముద్రం : మండంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏట్టుకూరిపల్లెలో మంగళవారం ఓం శక్తి భక్తులు అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు ఓంశక్తి మాలలు ధరించిన భక్తులు అమ్మవారికి పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో వివిధ అభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం అమ్మవారి చిత్రపటాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. గురుస్వామి ఓంశక్తి భక్తులకు ఇరుముడి కట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం మేల్‌మరవత్తూరు అమ్మవారికి ఇరుముడి చెల్లించుకునేందుకు వెళ్లారు.

రసాభాసగా రెవెన్యూ సదస్సు



వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు రసాభాసగా మారింది. తహసీల్దార్ రవికుమార్ సదస్సును ప్రారంభించిన కొంతసేపటికే అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్వారీలపై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై గ్రామస్తులతో క్వారీ నిర్వాహకులు ఘర్షణకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సదస్సు నుంచి అధికారులు వెళ్లిపోయారు.

కలెక్టరేట్‌లో అర్జీ ఇస్తే.. రెవెన్యూ సదస్సులో తీసుకోం!



తహసీల్దార్ పై మండిపడుతున్న గ్రామస్తులు

గంగాధర నెల్లూరు: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ ఇస్తే, మళ్లీ రెవెన్యూ సదస్సులో తీసుకోమని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదును తహసీల్దార్ తిరస్కరించారు. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని వరత్తూరుకు చెందిన టీడీపీ నేత కోదండరెడ్డి గ్రామంలో గంగమ్మ ఆలయ భూమిని ఆక్రమించుకున్నాడు. దీనిపై గ్రామస్తులు పలుమార్లు ఉన్నతాధికారు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు ఫిర్యాదు ఇచ్చారు. కలెక్టరేట్‌లో గతంలో ఇచ్చిన ఫిర్యాదును విచారణ చేస్తుంటే ఈ వినతిని తీసుకోమని తహసీల్దార్ తెలిపారు. దీంతో గ్రామస్తులు మండిపడ్డారు.

నగరిలో కళకళలాడుతున్న సెయింట్ మేరీ చర్చి



దుకాణ వద్ద విక్రయాలకు సిద్ధంగా క్రిస్మస్ సామగ్రి



కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న నగరి బస్టాండ్ ప్రాంగణం



తేజోమయం.. క్రీస్తు జననం

ప్రేమ..దయ..కరుణతో క్రీస్తు మానవాళి మనుగడకు మార్గదర్శకాలు అందించారు. అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న లోకానికి రక్షకుడిగా అవతరించారు. కరుణామయుని ఆగమనంతో యావత్ ప్రపంచం పులకిస్తుంది. ఆనందోత్సాహాలతో క్రిస్మస్ సంబరాలను జరుపుకుంటుంది. ఈ క్రమంలోనే తేజోమయునికి స్వాగతం పలుకుతూ క్రైస్తవులు చర్చిలను ముస్తాబు చేశారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేపట్టారు. పాపాలను పరిహరించు ప్రభువా అంటూ వేడుకున్నారు.

- క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం
- కరుణామయుని రాక కోసం ముస్తాబు
- వెలుగులు విరజిమ్ముతున్న చర్చిలు

నగరి : లోక రక్షకుడైన క్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా క్రైస్తవుల సంబరాలు అన్నీ ఇన్నీ కావు. నెల రోజులుగా హాలిడే సీజన్, సీజన్ ఆఫ్ గివింగ్, సీజన్ ఆఫ్ జాయ్‌గా జరుపుకుంటారు. మానవతా మూర్తి వాక్కుల స్ఫూర్తిని హృదయాల్లో నింపుకుంటారు. దీనిని స్పిరిట్ ఆఫ్ క్రిస్మస్‌గా పిలుస్తారు. ప్రభువు రాకను సూచిస్తూ తమ ఇళ్లలో స్టార్‌లు ఏర్పాటు చేసుకుంటారు. క్రిస్మస్ ట్రీ అలంకరించుకుంటారు. బాల ఏసు పశువుల పాకలో పుట్టిన దృశ్యాన్ని ఇళ్లు, చర్చిల్లో బొమ్మల రూపంలో అందంగా కూర్చుతారు.

ముస్తాబైన చర్చిలు

నగరి పట్టణంలోని సెయింట్ మేరీ చర్చి, సీఎస్ఐ తూర్పు ప్రేమాలయం, సీఎస్ఐ పశ్చిమ ప్రేమాలయం, ఎల్ఈఎఫ్ చర్చి, విజయపురంలోని సీఎస్ఐ చర్చి, వేపగుంటలోని నజరేతు లూథరన్ చర్చిలతో పాటు నియోజకవర్గంలోని చర్చిలు కొత్త రంగులతో అందంగా తీర్చిదిద్దారు. రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.



నింద్ర : విద్యుద్దీపాల వెలుగులో చర్చి

ప్రత్యేక ఆరాధన

క్రిస్మస్ సందర్భంగా అన్ని చర్చిల్లో బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ఆరాధన నిర్వహిస్తారు. క్రిస్మస్ సందేశం అందించడానికి ప్రత్యేక అతిథులను ఆహ్వానిస్తారు. క్రిస్మస్ గీతాలు ఆలపించి కేక్ కట్‌చేస్తారు. కొన్ని చర్చిలలో క్రీస్తు వెలుగుకు గుర్తుగా కొవ్వొత్తులు వెలిగించి క్యాండిల్ సర్వీస్ చేపడతారు.

నింద్ర : క్రిస్మస్ సందర్భంగా మండలంలోని చర్చిలను విశేషంగా అలంకరించారు. కనులపండువగా వేడుకలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేపడుతున్నారు.

గంగాధరనెల్లూరు: మండల పరిధిలోని చర్చిలు విద్యుత్ దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్నాయి. నిర్వాహకులు మంగళవారం అర్ధరాత్రి మంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి పటిష్ట ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా చర్చి ప్రాంగణాలలో ఏసుప్రభు జన్మవృత్తాంతం తెలిపే బొమ్మలతో ముచ్చట గొలిపే విధంగా పశువుల పాకలు ఏర్పాటు చేశారు.



విద్యుద్దీప కాంతులతో నగరి సీఎస్ఐ చర్చి

చర్చిలో కాంతులు

పాలసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని చర్చిని మంగళవారం విద్యుత్ దీపాల కాంతులతో అలంకరించారు.

కార్వేటినగరం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని ప్రార్థనా మందిరాలను ముస్తాబు చేశారు. మంగళవారం అర్ధరాత్రి భక్తిగీతాలు ఆలపిస్తూ బాలఏసుకు స్వాగతం పలికారు.

పవిత్రమైన రోజు



క్రిస్మస్ అంటే క్రైస్తవులకు ఓ పవిత్ర సందేశాత్మక రోజు. లోక రక్షణ, పాపుల విముక్తికి క్రీస్తు జన్మించారు. పరిశుద్ధమైన ఆత్మతో క్రీస్తును కొలిచే క్రైస్తవుల ఇంటే కాదు ప్రతి చర్చిలోనూ ప్రభువు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించుకుంటాం. – జోజెఫ్, పాస్టర్, ఎల్ఈఎఫ్, చర్చి, నగరి

సోదరులకు శుభాకాంక్షలు



గాఢమైన పాపాంధకారంలో మునిగిన లోకంపై ప్రేమ కరుణ, క్షమ వంటి మానవతా విలువల వెలుగులను ప్రసరింపజేసిన దైవ కుమారుడు ఏసుక్రీస్తు ఈ నేలపై ఉదయించిన క్రిస్మస్‌ను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ప్రభువు మార్గం అనుసరణీయం. క్రైస్తవ సోదరులందరికీ శుభాకాంక్షలు.

– ఆర్‌కే రోజా, మాజీ మంత్రి



విశేషాలంకరణలో విజయపురం సీఎస్ఐ చర్చి.



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన మాధవరం చర్చి



విద్యుద్దీపాలంకరణలో జీడీనెల్లూరు సీఎస్ఐ చర్చి



ప్రత్యేకంగా కొలువుదీర్చిన బొమ్మలు

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వడమాలపేట (విజయపురం) : స్కూల్ గేమ్స్ అండర్–19 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వడమాలపేట జూనియర్ కళాశాల విద్యార్థులు చరణ్ కుమార్, ఉదయ్ కుమార్ బంగారు పతకాలు, స్వీటీ కుమారి వెండి పతకం సాధించారు. ఈనెల 22, 23 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన చరణ్ కుమార్ 94 కేజీల విభాగంలో ఉదయ్ కుమార్ 83 కేజీల విభాగంలో స్వర్ణపతకాలు కైవసం చేసుకున్నారు. స్వీటీ కుమారి 63 కిలోల విభాగంలో ద్వితీయస్థానం దక్కించుకుంది. ఈ మేరకు ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ చంద్రమ్మ, పీడీ జయరామయ్య అభినందించారు.



విద్యార్థులతో ప్రిన్సిపల్

మధ్యంతర భృతికి డిమాండ్

పుత్తూరు: ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతిని (ఐఆర్) ప్రకటించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజీ డిమాండ్ చేశారు. మంగళవారం పుత్తూరులో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో పీఆర్సీ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సంక్రాంతి కానుకగా 30 శాతం మధ్యంతర భృతిని మంజూరు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావల్సిన రూ.2500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జూనియర్ కళాశాలల్లో 40 శాతం ప్రమోషన్లను టీచర్లకు ఇవ్వాలని, హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించి, రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొరస్వామి, నేతలు విజయ్, తేజోమూర్తి, శివకుమార్, చెన్నకేశవులు, శ్రీరాములు, గజరాజన్, గుర్రప్ప, గిరిబాబు, రాజేంద్రన్, తులసీరామ్, నాగరత్నం, మాధవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలాజీ

చట్టాలపై అవగాహన అవసరం

పుత్తూరు : ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి సూచించారు. మంగళవారం కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, కన్స్యూమర్ క్లబ్ సంయుక్తంగా వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ వినియోగదారుడేనని, ప్రభుత్వాలు కలిప్తున్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధర, నాణ్యత, పరిమాణం విషయాల్లో మోసపోయినట్లు భావిస్తే వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించవచ్చునని తెలిపారు. అలాగే ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి దేవకి, అధ్యాపకులు వాసవి, తిరుమలయ్య, గంగయ్య, లక్ష్మీబాయి, జ్యోతి, నాగరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

వెదురుకుప్పం: వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులు వ్యాపార, వాణిజ్య, ఆర్థిక లావాదేవీల పరంగా అన్నివిధాలా నష్టపోతున్నట్లు వింటుంటామన్నారు. అయితే వినియోగదారుల కోసం కొన్ని ప్రత్యేక చట్టాలను ప్రవేశపెట్టిన విషయం కొందరికి తెలియదన్నారు. చట్టాలు, ఫోరం వంటి చట్టాల ద్వారా వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఆర్థిక అతిథి ఉపన్యాసకులు పాండ్యరాజ్, అధ్యాపకులు మంగళగౌరి, వెంకటేశు, విద్యార్థులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి, వెదురుకుప్పం: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద

6,200 లీటర్ల సారా ఊట ధ్వంసం

నగరి : నగరి, నింద్ర, విజయపురం మండలాల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి వేర్వేరు చోట్ల 6,200లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. అలాగే ఓ ఇంట్లో నిల్వ చేసిన 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సంపత్ అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి మాట్లాడుతూ సారాలేని సమాజమే లక్ష్యంగా దాడులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మద్యం అలవాటు మాన్పించేందుకు రిహాబిలిటేషన్ సెంటర్లు సైతం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సారా తయారీ, విక్రయాలను వదులుకుని ముందుకు వచ్చిన వారికి కలెక్టర్‌తో మాట్లాడి జీవనాధారం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సారా తయారీ, విక్రయాలపై 9440902549 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. దాడుల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, నగరి సీఐ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

వెండి కిరీటం వితరణ

పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరులోని కన్యకల కొండపై వెలసిన శ్రీసుబ్రహ్మణ్యస్వామికి తిరుపతికి చెందిన గుప్తా మల్లికార్జున నాయుడు, విజయ దంపతులతో పాటు వారి కుమారులు భానుశేఖర్, డాక్టర్ అభిషేక్ రూ.65 వేలు విలువ చేసే వెండి కిరీటాన్ని మంగళవారం ఆలయ అర్చకులు తారకరామ శర్మ, శివరామశర్మకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి దర్శనభాగ్య కల్పించారు. ఆలయ ఆవరణలో మహిళలు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ఉభయదారులుగా వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి

నగరి : మండలంలోని ముడిపల్లెలో సోమవారం గుండెపోటుతో మృతిచెందిన గోవిందయ్యకు మాజీ మంత్రి రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఈ మేరకు గ్రామానికి వెళ్లి గోవిందయ్య భౌతికకాయానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కుటుంబీకులను ఓదార్చి, అండగా ఉండామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎంపీపీ కన్నియప్ప, మాజీ ఎంపీపీ జయచంద్రారెడ్డి, సర్పంచ్ ప్రకాష్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి





కోటగరం చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ, వేపంజేరి ఎస్టీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న దృశ్యం

గంగాధర నెల్లూరు : మండలంలోని వేపంజేరి, కోటగరం, జీడీ నెల్లూరు పంచాయతీల పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన చెన్నారెడ్డి ఎస్టీ కాలనీని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్టీ కాలనీల్లో మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కోటగరం గ్రామం, హరిజనవాడకు తాగునీరు సరఫరా అయ్యే తాగునీటి బోరు చెరువులో ఉండడంతో, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా మునిగిపోయింది. దీంతో తమకు తాగునీటి సరఫరాకు పూర్తిగా అంతరాయం కలిగిందని గ్రామస్తులు విన్నవించారు. ఈ మేరకు ఆయన చెరువులోని బోరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తబోరు వేసి, తాగునీటి వసతి కల్పనపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే జీడీనెల్లూరు జగనన్న కాలనీలో పర్యటించి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల గోడు.. కూటమి బాదుడు

- 27న బైక్ ర్యాలీ
- వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్ల ఆవిష్కరణలో జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి



విద్యుత్ చార్జీల బాదుడు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృపాలక్ష్మి, నాయకులు

కార్వేటినగరం: ఎన్నికల సమయంలో కరెంట్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు నాయుడు అప్పుడే ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపి నడ్డి విరుస్తున్నారని గంగాధనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కె.కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె పుత్తూరులోని తమ నివాసంలో ఆరు మండలాల నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ తలపెట్టిన విద్యుత్ చార్జీల బాదుడు కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అధికారం చేపట్టిన ఆర్నెల్లకే కరెంట్ చార్జీల మోత మోగిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. ఇప్పటికే ప్రజలపై రూ.6 వేల కోట్ల విద్యుత్ భారం మోపిన చంద్రబాబు, వచ్చే నెల నుంచి మరో రూ.9 వేల కోట్లకు పైగా కరెంటు బిల్లులు పెంచి మరింత భారం మోపనున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు రెండు వందల యూనిట్లు ఉచితంగా అందించారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ పథకానికి మంగళం పాడేందుకు సిద్ధమైందన్నారు. ఎన్నికలప్పుడు విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక యూటర్న్ తీసుకున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీలను అమాంతంగా పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. అందుకే ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైనట్లు చెప్పారు. ఈ నెల 27వ తేదీ శుక్రవారం తలపెట్టిన కార్వేటినగరంలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు శేఖర్‌రాజు, మణి, విజయకుమార్‌రెడ్డి, తులసీయాదవ్, మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, జెడ్పీటీసీ సుకుమార్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ అన్బుళగన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, నాయకులు చందురాజు, కృష్ణయాదవ్, వెంకటరత్నం, కుప్పయ్య, అశోక్‌రెడ్డి, అనంత రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా..

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు నియోజకవర్గంలోని ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటానని కె.కృపాలక్ష్మి అన్నారు. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు కలసికట్టుగా ప్రజల కోసం, పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లు కూడా గడవక ముందే ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందని, ఇప్పుడు వారికి అండగా నిలబడదాం అన్నారు.